

# నెమలి ఆడితే ...

కవిశిరోమణి

ఆచార్య రావికంటి వసునందన్

# నెమలి ఆడితే . . .

కవిశిరోమణి

**ఆచార్య రావికంటి వసునందన్**

**Nemali Aadithe**
by ***Kavishiromani***
**Prof. Ravikanti Vasunandan**

First Edition: **2008**
**© Writer**
Copies: **1000**

Cover Design: **M. Ramesh**

Price: **Rs. 60/-**

For Copies:

**All Branches of Vishalandhra**

**All Branches of Praja Shakthi**

**Navodaya Book House**
Opp. Lane to Arya Samaj Mandir, Koti, Hyderabad

**Telugu Book House**
Opp. Lane to Arya Samaj Mandir, Koti, Hyderabad

**Andhra Saraswatha Parishat**
Tilak Road, Hyderabad

**Sahachara Book Mark,**
Baghlingampalli, Hyderabad-44.

**Prof. Ravikanti Vasunandan**
Dr.B.R. Ambedkar Open University
Road No.46, Jubilee Hills, Hyderabad-33.
Cell: 9849852182

*Typeset at:*
**Literacy House**
*Vidyanagar, Hyderabad-7*
*Ph. 27098406, 27096464*

*Printed at:*
**Vipla Computer Services**
*(Designers & Multicolour Offset Printers)*
Nallakunta, Hyderabad - 500 044.
Ph.: 2765 4003, 2767 6910, 27677078

**డా. గంద్ర లక్ష్మణరావు**
తెలుగు ఉపన్యాసకులు
ప్రభుత్వ మహిళా డిగ్రీ & పి.జి. కళాశాల
కరీంనగర్

# కన్నుల పండుగ

మబ్బు పడితే వాన, మనసుపడితే కవిత, వెరసి కవిశిరోమణి ఆచార్య రావికంటి వసునందన్ కవితాసంపుటి **నెమలి ఆడితే...**

ఈ కవితా సంపుటి పేరు పెట్టడంలోనే ఒక జాతీయత, ఒక ప్రకృతి రామణీయకత, ఒక కళాత్మకత స్ఫురిస్తాయి. ఈ మూడంశాలు ఈ సంపుటిలో అల్లుకొని ఉన్నాయి. మొదటి కవిత **నా దేశం**లో దేశీయమైన సర్వ లక్షణాలను ఒక సమాహారంగా చూపించారు. ఒక శాంతి సందేశాన్ని, ఒక అజేయమైన సాహసాన్ని ఇందులో సగర్వంగా వ్యక్తం చేశారు. హిమగిరులను వర్ణించిన తీరు కవితాశిఖరాయమానంగా ఉంది. స్వయంగా అక్కడ తిరిగినప్పుడు చూసిన దృశ్యాన్ని మనోహరంగా మహావైభవంగా మనముందు ఒక కదులుతున్న ప్రకృతి దృశ్యాన్నుంచారు.

ఈ ప్రకృతి పరిశీలననుంచి దాని తాత్వికతనుంచే ఒక నెమలిని కవితా వస్తువుగా అనేకాంశాల ప్రతీకగా ఎంచుకున్నారు కవి. కేవలం నర్తనకే పరిమితంగా కవులచే వాడబడుతున్న నెమలి క్రేంకారం ఒక ఓంకారమనీ, దాని మనసు కల్మషం లేని పసిమనసు అనీ, ఆవేశానికి వస్తే అది ఎగిరి తన్నే కుమారస్వామి వాహనమనీ వర్ణించడంలో మళ్ళీ దేశస్వభావం కనబడుతుంది. అందుకే ఆ శీర్షికను **స్వభావం** అన్నారు. నెమలి మన జాతీయ పక్షి. జాతి సౌందర్యాన్ని, శౌర్యాన్నీ నెమలిలో ప్రతిబింబించారు. నిజానికి ఇందులోని చాలా కవితల్లో ఇట్లా ఒక వస్తువు పైకి కనిపిస్తుండగా మరో అర్థం లేదా మరో అంశం ధ్వనింపచేయడం కనిపిస్తుంది. ఇది పరిణతి పొందిన కవులకే సాధ్యమయ్యేపని. అవును మరి గద్యం, పద్యం, గేయం, వచన కవిత్వం ప్రక్రియల్లో నలుబది వరకు రచనలు చేసిన వసునందన్ నిరంతరం కవిత్వం జీవితంగా తపిస్తున్న కవి. అందులోనే తరిస్తున్న కవి.

ఇంత కవిత్వమా? అని ఎవరూ ఆశ్చర్యపోనవసరం లేదు. **అంతర్ముఖీనత అలవడితే/ అంతఃకరణంలో జీవవేదన నిత్య జాగృతమైతే / హృదయం రసప్రకరణమైతే / మనస్సు పసిపాప ఐతే / అనుభవాలన్నీ అనుభూతులైతే / సృష్టి అంతా తానే ఐతే...** తన్నుకు వస్తుంది కవిత్వం అని తానే సమాధానం చెప్పారు. ఇందులో జీవవేదన జాగృతం కావడం అనేది కొత్త ప్రయోగం. దీన్నే అందరూ సామాజికస్పృహ అనే ఒక పొడిమాటతో చెపుతుంటారు. స్పృహ బుద్ధిగతం, వేదన హృదయగతం, ఇదీ భేదం.

వర్తమానంలోని ప్రతి అంశానికీ కదిలిపోతారు వసునందన్. వసునందనుడంటే చెట్టు కదా! వీచే ప్రతిగాలికీ కదిలిపోయే చెట్టువంటివారు ఈ కవి. బాల్యాన్ని, వెలకట్టలేని శ్రమమూల్యాన్ని తన కవితలో తాను చూసిన దృశ్యాలనుంచే చూపిస్తారు. వ్యథార్థజీవుల యథార్థగాథలు అని శ్రీశ్రీ అన్నట్లుగా అనేక నిజాలే కవిత్వంగా అవతరించాయి. **విలువ, అస్థిపంజరాలు, కాపురం కంకాళాలతో, అమానుషం** మొదలైన కవితల్లో దీన జీవన దృశ్యాలు కనిపిస్తాయి. **మస్తక వితరణ** కవిత తాను పనిచేస్తున్న సార్వత్రిక విశ్వవిద్యాలయం నుంచి విద్యార్థులకు పుస్తకాలందించేటపుడు కనిపించే శ్రామిక దృశ్యం.

ఏ కవితలోనూ ఊహలు లేవు, అసత్యాలు లేవు. అన్నీ కళ్ళముందర కనపడుతున్నవే. అయితే వాటిని యథాతథంగా చూపితే వార్తలవుతాయి. వాటిని కవిత్వం చేయడంలోనే కవి శిల్పం ఉంది. కేవలం శిల్పమే కాదు ఉన్న విషయాన్ని బలంగా చెప్పడం కూడా ప్రధానమే. అందుకే ఆయన వార్తలను కవిత్వం చేసి చూపిస్తారు. **ఈ-కుక్క, ఎగిరే కారు, మెరిసే బంతులు, శనికీ హరికేన్, టి-కిరణాలు** ఇట్లాంటి వార్తలు ఒక విధంగా విచిత్రంగా కనిపించినా వైజ్ఞానిక ప్రగతికి నిదర్శనాలు. కాని వాటి ఫలితాలు మానవులపై ఎట్లా ఉంటాయని భవిష్యద్దర్శనం చేయడం ఈ కవి విశిష్టత. ఎగిరే కారు వస్తే మంచిదే ట్రాఫిక్ సమస్య తగ్గుతుందంటారు. మెరిసే బంతులైతే ఆకాశంలో కమ్ముకునే ఆయుధాలు కావచ్చు. ఒకటి సౌకర్యం అయితే మరొకటి విధ్వంసం అయ్యే ప్రమాదం ఉంది. అందుకే అంటారు - **ఎంత సంక్షేమమైనా సాధ్యమే / శాస్త్ర విజ్ఞానం సవ్యంగా సాగితే...** అని ఈ-కుక్క అనే కవితలో. శనికీ హరికేన్ అనే కవితలో హరికేన్ ఒక తుఫాను సూచించే లాంతరు.

దాన్ని ఇక్కడ తెచ్చిపెట్టి శనికీ భూ కబ్జాల తుఫాను రాబోతుందని హెచ్చరిస్తారు. శనికి భయపడడం పోయి శనికే భయం కలిగించే ఈ వ్యక్తీకరణ వర్తమాన భూవ్యాపారాల, వ్యవహారాల దుర్మార్గాలకు పరాకాష్ఠ.

ఏ రంగంలో ప్రగతి సాధించినా అది మానవ కళ్యాణానికే కావాలని కవి తపన. రాజకీయాలలోని, సమాజంలోని కాలుష్యం తొలగనిదే మనకు సుఖశాంతులుండ వంటారు. **మానవత్వం ఇంకిపోయింతర్వాత / మరేమున్నది వికట నృత్యం కాక** అని తన ఆవేదనను వెల్లడించారు.

చాలా సాధారణ దృశ్యాలను కవిత్వం చేయడం ఈ కవి నేర్పరితనం. “బస్సులో రద్దీ, మండుటెండలో స్కూటర్‌పై వృద్ధ దంపతుల స్వారీ, ఆటోపై కనిపించిన అక్షరాలు” మంచి కవితలుగా రూపొందాయి. వాటిలో జీవన దృశ్యాలు, జీవనసారాంశాలు, గొప్ప సూక్తులు జోడించి చూపడం విశేషం.

**ఆరోగ్యమే మహాభాగ్యం అని ఎందుకంటారో ఇప్పుడు తెలిసింది.**
**కవిత్వానికి కావలసింది కరిగే గుండె / ఆస్తికాదు అంతస్తు కాదు** ఇట్లాంటివెన్నో కనిపిస్తాయి.

ఈ అన్నిటినీ ఎవరు పట్టించుకొమ్మన్నారు అని అడుగుతారేమోనని కవి తానే చెపుతున్నారు.

**పట్టించుకుంటే కష్టం / పట్టించుకోకపోతే నష్టం ...** వ్యవస్థ తీరు ఇది అని.

బయటికి కనిపించే దృశ్యాలే కాదు మనస్తత్వాలను కూడా కవిగా విశ్లేషణ చేసి చూపడం లోచూపుకు నిదర్శనం. **ప్రేమ, ఉల్టా, ఎప్పుడూ ఇంతే** మొదలైన కవితలిందుకు మచ్చుతునకలు.

**సంక్రాంతి, సంక్రమణం, కొత్తడైరీ**లలో చేసిన వర్ణనలు ఎప్పటి సంక్రాంతి, కొత్త సంవత్సరాలకు ఆనవాయితీగా చెప్పినవి కావు. పెద్ద సంపదలు, భోగభాగ్యాలు కావు అందించాల్సినవి – **ఒక వసుధాతలం నిండా ప్రశాంతత / గుక్కెడు ఓదార్పు / పిడికెడు మంచి గుండె / తెచ్చి ఇస్తావా సంక్రాంతీ!ఈ సారైనా నువ్వైనా** అనే ఒక ప్రశ్నలో ఇంకిపోతున్న మానవత్వం పట్ల పడుతున్న వేదన వ్యక్తమవుతుంది.

ప్రతి కవితా ఒక కొత్త నిర్మాణంతో కనపడుతుంది. కొన్ని సుదీర్ఘంగా ఉంటే కొన్ని మరీ చిన్నవిగా నాలుగు చిన్న పంక్తుల ముక్కలుగా కనిపిస్తాయి. కొన్ని ఎత్తుగడల్లో ప్రశ్నలు, కొన్ని ముగింపుల్లో ప్రశ్నలు, కొన్ని ప్రస్తార విస్తారాలు, కొన్ని దట్టించిన ఫిరంగులు.

కొన్ని చోట్ల గొప్ప సమాసప్రయోగం కొన్ని కొత్త పదబంధాలు కనిపించి కవి పాండిత్యాన్ని కవితా నైపుణ్యాన్ని పట్టిస్తాయి. ఉదాహరణకు **తరుశాఖా కబరీభరానికి వేసుకుంటున్న సాంబ్రాణి** వంటి ప్రయోగాలు కొన్ని అయితే, **సుమనోహరంగా** నవ్వు అని మరో విశేషప్రయోగం. సుమనోహరం పువ్వులాగా, మనోహరంగా అనే శ్లేష. **గడెక్కి ఆడడం** ఒక నాటి పల్లెగారడిని గుర్తుకు తెస్తుంది. **అగ్గినిప్పు, వెన్నెలతడ** వంటివి కొత్తమాటలు. తడ అనేది అలకు మారుగా వాడుకలో ఉన్నమాట. **పాలీ ప్రసవం** కూడా కొత్త కల్పన. మనసుల మధ్య, మనుషుల మధ్య అంతరాలు వీరి కవితల్లో చాలా స్పష్టంగా చిత్రించారు. కంటికి కనిపించే ఎన్నో ఎన్నో తనను కదిలించి కవిత్వం రాయించాయి. **'నన్ను'** అనే కవితలో ఆత్మాశ్రయధోరణిలో తీరని వ్యథను వ్యక్తం చేస్తారు ఒక యోగిలా, మనుషుల్లోని అహంకారమనే దుర్గుణం ఎప్పుడూ అంతరించదేమని?

**నిలువెల్లా కమ్ముకున్న మాయ పొర / ఇదే అనాది కథ / ఆత్మ వ్యథ.**

ఆనందాశ్రువులో దుఃఖబాష్పాలో – చూపులు వర్ణవర్ణాలుగా మారి**నెమలి ఆడితే...** అందే కన్నుల పండుగ ఈ కవితా సంపుటి.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ., విద్యార్థులుగా ఏర్పడిన మా పరిచయం, క్రమంగా పెరిగిన స్నేహం, తెలుగు అధ్యాపకులుగా ఉంటున్న ఏకత్వం, ఒక జిల్లా వాసులం కావడం ఈ అనుబంధాలు కారణంగా నాతో ఈ ముందుమాట రాయించిన సహృదయ మిత్రునికి ధన్యవాద పూర్వక అభినందనలు.

**– జి. లక్ష్మణరావు**

# నా దేశం

*చురకత్తై దూసుకువస్తుంది దర్భలామారి గడ్డిపరకైనా*
*చురక తగిలితే ఆత్మాభిమానానికి*
*ఏం వింత చీమూనెత్తురున్న సిపాయీ తిరుగు బాటులో?*
*దేశ స్వాతంత్ర్య భావనలో!*
*ఆనాటి నుండి నేటిదాకా*
*ఎందరు ఝాన్సీలు రాణా ప్రతాప్‌లు భగత్‌లు గాంధీలు!*
*అభినందనీయులు ప్రాతర్వందనీయులు!*
*ఎవరి కరుణ ఈనాటిగాలి స్వేచ్ఛగా వీస్తుందంటే*
*ఎవరి చలువ ఈనాటి వెన్నెల చల్లగా కురుస్తుందంటే?*
*ఎవరి త్యాగం? ఎంతటి వీరగంధవైభోగం?*

*అలుగులెత్తిన పచ్చిస్వార్థాన్ని*
*ఉక్కుకోటలు పెట్టిన ఉన్మాదాన్ని*
*తుత్తునియలు చేసిన సత్యాగ్రహశతఘ్ని*
*శతకోటి భారత జనగణ నయనరాజీవ మిత్రవరాగ్ని*
*గాంధీ!*
*జవహర్లాల్ నుండి నేటిదాకా*
*అహరహం దేశ సౌభాగ్యంకోసం*
*పరిశ్రమించే నేతలు*
*గాంధీవారసులు భారత భాగ్యవిధాతలు!*

*నా దేశమంతా ఒక్కటి*
*ఈ జాతి అంతా ఒక్కటి*
*తరతమ భేదాలు విడిచి*

*వర్ణ వర్గ జాతి మత వైషమ్యాలు మరచి*
*నిరంతరం పురోగమించే*
*నిత్య చైతన్యవంతం నా దేశం!*
*సస్య శ్యామలం తృణకాష్ఠజల సంపూర్ణం*
*సుజలాం సుఫలాం నా దేశం!*

*ప్రజల యొక్క ప్రజలచేత ప్రజలకోసం*
*నడిచే ప్రజాస్వామ్య విధానం*
*నా దేశం భారతదేశం!*
*కన్యాకుమారి పాదపీఠంగా*
*హిమవన్నగం భవ్యకిరీటంగా*
*గంగాయమున తుంగభద్ర కృష్ణాగోదావరి హారాలతో*
*పరమసుందర ప్రకృతి దృశ్య శోభాలంకారాలతో*
*జన సంకీర్ణ గ్రామాలు పట్టణాలు ఉచ్ఛ్వాస నిశ్వాసలుగా*
*అనేక శకుంత సంతాన  కలకూజితాలు పలుకులుగా*
*శ్రుతి స్మృతి పురాణేతి హాసకావ్యరీతులు జోహారులుగా*
*చీకటి వెలుగులు జనజీవన గతులు రెప్పలుగా*
*సుఖశాంతి సువిశాల పద్మపత్ర నేత్రాలతో*
*ఎల్లవేళలా కన్న బిడ్డలను చల్లగా చూచే*
*దివ్యధాత్రి భరత జనయిత్రి నాదేశం!*

*విశ్వదేశాలకు శాంతి పాఠం నా దేశం*
*ఐహికాముష్మిక వైభవాలకు సింహ పీఠం నా దేశం!*

*('నాదేశం' శీర్షికతో దూరదర్శన్ నిర్వహించిన కరీంనగర్ జిల్లా కవుల సమ్మేళనంలో... 25.02.07)*

# స్వభావం

ఎంత సుప్రశాంతత ఉంటే
ఆడాలి నెమలి?
పర్యావరణం సమతౌల్యంగా
వాతావరణం చల్లగా
గాలి మెల్లగా
ప్రకృతి పచ్చగా
మబ్బు దయగా

కల్లాకపటం తెలియని పసిమనస్సు నెమలి
మాయా మర్మంలేని శిశుహృదయం నెమలి
సుమనోహరంగా నవ్వుతుంది అమాయకంగా
వేలకన్నులతో నెమలి

అప్పటిదే ఐనా పట్టించుకోదు
సింగిణీ రంగులకే పొంగిపోయే పిచ్చిది నెమలి
తన ముంగిలిలోనే ముగ్గులు ఒలికాయని
పట్టరానంత పారవశ్యం
నిలువెల్లా పులకింతలు
తనదే అనుకున్న ఋతువు
ఏ మాత్రం తల దువ్వినా

పంచ భక్ష్య పరమాన్నాలు కోరదు
పచ్చి విషమైనా నమిలి కడుపు గడుపుకుంటుంది నెమలి

కాతరు చెయ్యదు కల్లబొల్లి కబుర్లు పితూరీలు
కుటిలతంత్రాలు మాయలు
తన గోల తనదే తప్ప ఏ జోలికీ వెళ్లదు నెమలి
ఉన్నాలేకున్నా తిన్నా తినకున్నా
క్రేంకారంలో ఓంకారం చిలికే
చిన్మయానంద స్వరూపం
నా జాతి నెమలి

చుక్కలు రాలగొడుతుంది తిక్కరేగిందా
అంతెత్తున లేచి
కుమారస్వామి వాహనమై నెమలి.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1937**

* * *

**Read other books of Prof. R. Vasunandan @**

**http://kinige.com/kbrowse.php?via=author&name=Kavishiromani+Acharya+Ravikanti+Vasunandan&id=722**